IJCRT.ORG ISSN : 2320-2882
INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)
An International Open Access, Peer-reviewed, Refereed Journal

# నాకు నచ్చిన నా కథ సంకలనాలు 'మాతృత్వ పరిశీలన'

బళ్ళ లక్ష్మణ కుమార్
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

పర్యవేక్షకులు
డా॥ నేమాని శారద,
తెలుగు అధ్యాపకురాలు,
డా॥ వి.యస్.కృష్ణా డిగ్రీ ప్రభుత్వ కళాశాల,
విశాఖపట్నం.

సహపర్యవేక్షకులు
ఆచార్య జర్రా అప్పారావు,
తెలుగు ప్రొఫెసర్, తెలుగుశాఖ
ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సంపాదకుని పరిచయం :

ఎన్.కె. బాబుగా పిలవబడే నిడగంటి క్రిష్ణబాబుగారు నిడగంటి సూర్యనారాయణ, తవిటమ్మ దంపతులకు 1964 డిసెంబర్ 31వ తేదీన ప్రస్తుతం విజయనగరం జిల్లా, పెదమానాపురం గ్రామంలో జన్మించారు. వీరి తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో ప్రాథమిక తరగతులను తండ్రి పనిచేస్తున్న పెదమానాపురం పాఠశాలలోనే పూర్తిచేశారు. ఇంటర్మీడియట్‌ను బొబ్బిలిలో పూర్తిచేశారు. ఉన్నత చదువులు చదవడానికి తగిన ఆర్థిక స్తోమత లేకపోవడంతో విశాఖపట్నంలో ఆంధ్ర స్టీల్ కార్పొరేషన్‌లో రోజువారి కూలీగా కొన్నాళ్లు, జోళ్ళషాప్‌లో కొన్నాళ్ళు, లాడ్జిలో మరి కొంతకాలం ఇలా చిన్నచిన్న ఉద్యోగాలు ఎన్నో చేశారు. కొంతకాలానికి ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో ప్రైవేట్‌గా బి.ఎ. (తెలుగు), ఎమ్.ఎ. (తెలుగు) పూర్తిచేశారు.

ఎన్.కె. బాబు 2005లో ఎన్.కె. పబ్లికేషన్స్ పేరుతో ప్రచురణ సంస్థను స్థాపించడం ద్వారా అనేకమంది నూతన కథకులను పాఠకలోకానికి పరిచయం చేశారు. 2019 నుండి ప్రచురిస్తున్న 'నాకు నచ్చిన నా కథ' అనే కథా సంకలనాలకు సంపాదకులుగా ఉంటూ 2023 నాటికి నాలుగు సంకలనాలు, ప్రచురించారు. 2017 సం□కి కేంద్ర సాహిత్య అకాడమీకి బాలసాహిత్యం విభాగానికిగాను జ్యూరీ మెంబర్‌గా, న్యాయనిర్ణేతగా కూడా ఉన్నారు. రేడియోలో ప్రసంగాలు కూడా చేశారు. 2008లో 'నాని' అనే పేరుతో పిల్లల

మాసపత్రిక స్థాపించి, పత్రికను ప్రచురిస్తూ బాలసాహిత్యానికి కూడా సేవ చేస్తున్నారు. ఈ విధంగా ఎన్.కె.బాబుగారు అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొంటూ నేటికీ తెలుగు సాహిత్యానికి కృషి చేస్తున్నారు.

ఉపోద్ఘాతం :

స్త్రీ లేకుంటే ఈ సృష్టి ఎప్పుడో అంతమయ్యేది. ఆమె తన జీవితాన్ని యావత్తు తనతో అల్లుకున్న బంధాలకు ధారాదత్తం చేసింది. అమ్మగా, భార్యగా, తోబుట్టువుగా, కోడలుగా, కూతురుగా కుటుంబాల్లో భాగమైంది. పలురంగాల్లో పురోగమించి తానేంటో నిరూపించుకుంటుంది. సమాజగమనంలో భాగమై గుర్తింపబడుతుంది. మాతృత్వంతో మురిపిస్తూ, బిడ్డల్ని తీర్చిదిద్దుతూ, వారి భవిష్యత్తు బాటని నిర్మిస్తూ విలువలని పాటింపజేస్తుంది. భర్తకు తగిన ఇల్లాలిగా సేవలు అందిస్తోంది. తండ్రిని అర్థం చేసుకునే కూతురిగా ఉంది. ఆమె ఆత్మాభిమానాన్ని నిలుపుకుంటూ తనదైన వ్యక్తిత్వంతో ఆదర్శమూర్తిగా ఉంది. నాకు నచ్చిన నా కథ-1, 2 సంపుటాలు రెండిట్లోనూ స్త్రీ విశిష్టతను, ఆమె మాత్రమే చేయగలిగిన ఉత్తమ విధులను త్యాగాలను మాతృత్వపు స్పర్శలను అందించిన కథలున్నాయి.

ముసురు

కథ :

పార్వతమ్మ, ఆనందరావు దంపతులకు ముగ్గురు కొడుకులు. ఆనందరావు చనిపోవడంతో అతడి ఉద్యోగం పెద్ద కొడుకుకి వస్తుంది. పార్వతమ్మ అన్న కూతురు అయిన వసంతని పెద్దకొడుకు రాజేష్‌కిచ్చి పెళ్లి జరిపిస్తుంది. కోడలు స్వార్థపరురాలవడంతో ఇంటి బాధ్యతలకు భర్తని దూరంగా ఉంచుతుంది. వారు ఉద్యోగరీత్యా దూరంగా ఉండటంతో పార్వతమ్మ పింఛన్ డబ్బులతో మిగిలిన కొడుకులైన రమేష్, సురేష్‌లను పోషించుకునేది. తల్లి తమ్ముళ్ల పట్ల ప్రేమ ఉన్నా భార్య వల్ల రాజేష్ ఏం చేయలేకపోయేవాడు. ఇదిలా ఉండగా ఎడతెరిపి లేక మూడు రోజుల వానకు పూరిల్లు కాస్త తడిసి ముద్దవుతుంది. పిల్లలు ఆకలి అనడంతో ఇంట్లో తినేందుకు కూడా ఏమీ లేనందున వీధిలోని చిట్టెమ్మ ఇంటికి, భారతి ఇంటికి వెళ్లి బియ్యం కావాలని పార్వతమ్మ అడుగుతుంది. భారతి వండిన అన్నం కొంత ఇవ్వగా తడుస్తూ వచ్చి కొడుకుల కడుపు నింపి తాను నీరు త్రాగుతుంది. పిల్లల మీద పమిట కొంగును కప్పి పార్వతమ్మ చలికి అలాగే చనిపోతుంది. ఈ కథను డా□ జడా సుబ్బారావు రాశారు. ఎన్.కె.బాబు సంపాదకత్వంలో వచ్చిన 'నాకు నచ్చిన నా కథ-1' అనే కథ సంకలనంలో ప్రచురితమైంది.

విశ్లేషణ :

తల్లిని ప్రేమించలేని కొడుకులున్నా తల్లి పక్షుల రెక్కల కింద పిల్లల్ని దాచి సంరక్షిస్తుంది. స్త్రీమూర్తిలోని త్యాగపూర్వకమైన కోణాన్ని చర్చింపజేశారు. వాస్తవానికి ఈ కథ మానవ సంబంధాల అంశం కూడా ఉన్నా ఓ స్త్రీ మూర్తి తన బతుకుని యావత్తూ కుటుంబానికి ధారపోసి తాను కరిగి అరిపోతుంది. ఇలా విషాదాంతంగా మిగిలిన కథ అయినా అమ్మ ప్రేమ, త్యాగనిరతి ఎంత గొప్పదో అనే విషయాన్ని అనుసరించి విశ్లేషించడం జరిగింది. అమ్మ అనే స్థానం స్త్రీ జన్మకు మాత్రమే దక్కిన ఒక గౌరవం. ఈ గౌరవం నిలుపుకునే వ్యక్తిత్వంతో ఆమె తనవారు ఎలా ఉన్నా తన బాధ్యతని విస్మరించదు. పుట్టింట్లో ఒకలా గడిచినా అత్తింట్లో స్త్రీ ఇల్లాలిగా, కోడలిగా, తల్లిగా ఒదిగిపోతుంది. విలువల సమన్వితమై మాతృత్వపు మమకారాలను సంతనానికి పంచుతుంది. అమ్మగా మారని మునుపుకన్నా తల్లిగా మారిన తర్వాత ఆమెలో ఒక సంపూర్ణ బాధ్యతాయుత కోణం, సహనం అనేది పొంగిపొర్లుతుంది. భర్త పోయినా పెద్దకొడుక్కి ఇల్లు, తల్లి పట్టకున్నా కొడుకు, కోడల్ని ఒక్క మాట అనలేక ఓర్పుని వహించింది. ఇక్కడ ఆమె అత్తగా కూడా తల్లి పాత్రని ధరించి కూతుర్ని క్షమించినట్లు కోడల్ని క్షమించేసింది. కుటుంబ గొడవలు బంధాల విచ్ఛిన్నానికి దారితీస్తుందనే అభిప్రాయం ఆమెది కావచ్చు. భర్త పోయాక పెద్ద కొడుకు దూరమైనా మిగిలిన ఇద్దరు కొడుకులకు నేనున్నానన్న ఆత్మీయతనే తన చివరి క్షణం వరకూ పంచింది. అమ్మ స్పర్శనే వెచ్చదనంగా అందించి తాను చలికి గడ్డ కట్టింది. పిల్లల కోసం ప్రాణాలను కూడా వదిలే ప్రేమమయి కనుకే ఆమె రెండక్షరాలైన 'అమ్మ' అయినా అనంతమైన వాత్సల్య రూపిణిగా రచయిత దర్శింపజేశారు.

పిల్లలు తాను ఉన్నంతవరకూ తన ముందు కష్టపడకూడదని తల్లి కోరుకుంటుంది. అవసరమైతే వారి కోసం, వారి ఆకలి తీర్చడం కోసం భిక్షగత్తె కాగలదు. ప్రకృతి సహకరించుకున్నా గడప దాటి పిల్లల ఆకలి తీర్చగలదు అని ఈ కథలో రచయిత ప్రస్తావించిన మాటలను గమనించవచ్చు.

"*అరసోలెడు బియ్యముంటే ఇవ్వమ్మా! రేప్పొద్దున్నే ఇచ్చేస్తాను*" అని ఇల్లిల్లు తిరిగి బదులు అడుగుతుంది. అది ఫలించినప్పుడు తన ఆత్మాభిమానాన్ని చంపుకుని బిడ్డలు కడుపు నింపాలనుకుంటుంది. "*భారతీ! నిన్నటి నుంచి పిల్లలు ఏమీ తిన్లేదే... వాళ్లను చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. బియ్యం ఉంటే ఇవ్వవే*" అంటూ జోలి పట్టి ప్రాధేయపడింది. పార్వతమ్మకి తన ఆకలి గుర్తు లేదు. వాన గురించి పట్టింపు లేదు. పిల్లల కడుపు నింపాలని తప్ప మరేం ఆలోచన లేదు. దొరికిన నాలుగు మెతుకుల్ని వారికి తినిపించడానికి అమ్మ పడే ఆరాటంలోనే ఆమె హృదయం ఏంటో అర్థం అవుతుంది. ఇక్కడ పేదరికం, ధైర్యం కనిపిస్తున్న తల్లి పేగు పిల్లలకై తల్లడిల్లడంలో ఆమె వారిని కాపాడుకొని తనను కోల్పోయే త్యాగం అయ్యాయి. ప్రాణం పోసే అమృతమూర్తి ఈ విధంగా అన్నపూర్ణగానే ఉంటుంది.

ఒక స్త్రీలోని సహనం, ఓర్పు ఆమెకు పెట్టని ఆభరణాలు. బిడ్డ చిరుక్షణం నుండి ఓ పెద్ద వ్యక్తిగా ఎదగడానికి ఆమె ప్రాణాలు అన్నీ ఒడ్డుతుంది. ప్రాణం ఉన్నంతవరకూ

పాశాన్ని వీడని తల్లి స్త్రీ జన్మకి ఓ ఆణిముత్యం. కానీ అమ్మని వీడి రెక్కలతో ఎగిరిపోయే కొడుకులున్నా ఆ తల్లి బాధ్యతనే ప్రేమనే చూపుతుంది. ఎగిరిపోయేవారు పోగ వారి గురించి ఒక్క మాటా అనుకోక మనసులోనే వారి బాగుని కోరే తల్లికి ఏ బంధమూ సాటిరాదు. అలాంటి అమ్మని రోడ్డు మీద వదిలే వారికి తల్లిపాల రుచి తెలియదు. పైగా ఆమెకు గుండె గాయం చేసి తరలిపోతారు. ఇలాంటివారు అమ్మ అంతిమ శ్వాస కూడా పిల్లల గుండెచప్పుడునే వినిపిస్తుందని తెలుసుకోవాలి. అందుకే కథాకర్త విషాదంలోనూ పార్వతమ్మ బిడ్డల్ని పొదుపుకున్న తల్లిగా ఆమె ఔన్నత్యం ఎలాంటిదో తెలిపారు. తల్లి ప్రథమ పూజ్యురాలు. సమస్యలు ముసురుకున్నా అమ్మ అమ్మలాగే ఉంటుంది. అలాగే మరణిస్తుంది. అందుకే తల్లికి ప్రతి సృష్టి జరగనే లేదు. తల్లి రక్తమాంసాలను పంచి సంతానాలకు బతుకునిస్తే ఆమె కష్టాన్ని బాధ్యతని గాలికొదిలే తనయులు నీచులు. మొదటి నుంచి ఉన్న తల్లి కన్నా వెనకొచ్చిన భార్యకు విలువివ్వడం అమ్మ పాలు తాగి రొమ్ము గుద్దడం. కానీ తల్లి మాత్రం తన దుస్థితికి బిడ్డల్ని కారకులను చేయదు. ఆమె అంతిమ క్షణం వరకూ వారి కోసమే పోరాడుతూ కూలిపోతుంది. బిడ్డలు చీరకొంగు కింద తడవలేదనే భ్రమతో ఉన్న అమ్మ తాను మాత్రం తడిసి ముద్దయింది. పోతూ పోతూ ఆమె చేతుల కింద బిడ్డల్ని పొదువుకొని వారిని సంరక్షించుకున్నానే తృప్తితోనే ప్రాణ త్యాగాన్ని అమ్మ మాత్రమే చేస్తుంది. అలాంటి అమ్మని నిర్లక్ష్యం చేయని కొడుకులు నేడు అవసరం. ఆమెని తమ రెక్కల కింద కాపాడుకునే తనయులు కావాలి. ఆ బాధ్యత, భరోసా అమ్మకు అందించే సంతానాలే ఆ మాతృమూర్తి హృదయానికి దీపికలు. లేదంటే మానవ జన్మకు పుట్టగతులు ఉండవని అందరూ గ్రహించాలి.

పున్నమి చందురుడు :

కథ :

రిక్షా నడిపే రాజయ్యకు వ్యవసాయ కూలీ అయిన యాదమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. యాదమ్మ దంపతులకు తణుకు వినాయక నిమ్మజ్జనాల్లో ఒక కుర్రాడు దొరుకుతాడు. అతడికి రాంపండు అనే పేరు పెట్టి వారే పెంచుతారు. అతనికి మాటలు రాకపోవడంతో వైద్యునికి చూపుతారు. వైద్యుల సలహాతో మాటలు వచ్చేలా చికిత్స చేసే జోగారావు అనే వ్యక్తి ఉన్న సంస్థలో రాంపండును చేరుస్తారు. అతడు వారి పరిస్థితిని చూసి కొంత రుసుమును తగ్గించి, ఆ కుర్రాడిపై ప్రత్యేక శ్రద్ధను చూపుతాడు. ఒక్కోసారి యాదమ్మ తొమ్మిది కిలోమీటర్లు రాంపండుని ఎత్తుకొని నడిచేది. వర్షాలు వచ్చి రాజయ్యకు బాగేలేనప్పుడు యాదమ్మ రిక్షా తొక్కి రాంపండుని జోగారావు వద్దకు తీసుకెళ్ళేది. రాంపండుకి మాటలు వచ్చి చాలా బాగా చదివేవాడు. 11వ ఏటనే పదో తరగతి ఉత్తీర్ణుతని జిల్లా ప్రథముడిగా పొందుతాడు. మీడియా అతడి విజయాన్ని కొనియాడుతుంది. యాదమ్మ వారితో తాను పెంపుడు తల్లినని చెప్తుంది. వారం రోజులు తర్వాత ఎస్సై సుధీర్‌తో పాటు రాంపండు అసలు తల్లిదండ్రులు వస్తారు. తాను మూగవాడినని తెలిసి కావాలనే తనను వదిలించుకున్న వారి వెంట తాను వెళ్ళనని రాంపండు చెప్తాడు. తనవారు యాదమ్మ దంపతులేననగా వారు చేసేదేం లేక వెనుతిరుగుతారు. ఈ కథను ఎమ్.ఆర్.వి. సత్యనారాయణమూర్తి రాశారు. ఎన్.కె. బాబు

సంపాదకత్వంలో వచ్చిన 'నాకు నచ్చిన నా కథ-2' అనే కథాసంకలనంలో ప్రచురితమైంది ఈ కథ.

విశ్లేషణ :

మాతృమూర్తి వాత్సల్యం, ఆమె బిడ్డ కోసం పడే ఆరాటం, ఆ తల్లి హృదయం ఈ కథని ఆశాంతం స్పృశించింది. ఆమె కడుపున పుట్టిన బిడ్డలపైనే కాకుండా పెంచిన బిడ్డపైన కూడా ప్రేమ చూపగలగడం స్త్రీ యొక్క గొప్పతనం. నిరుపేద అయిన తల్లి మనసెంత సంపన్నమో నిరూపించిన ఈ కథ యాదమ్మ అనే అమృతమయిని పరిచయం చేసింది. బిడ్డల్ని కని, రోడ్డు మీద పడేసి పోతూ జాతికే కళంకం తెస్తున్న కొందరికి బుద్ధి వచ్చేలా తల్లి అంటే ఎలా ఉండాలో ఉదహరించి చూపడం విశేషం. పేగు తెంచుకొని పుట్టే బిడ్డని ఏ తల్లైనా నవమాసాలు మోస్తుంది. తన భారంతో పాటు బిడ్డ బరువుని ఆనందంగా మోసే తల్లి బిడ్డ బరువు, బాధ్యతల్ని బిడ్డ పుట్టక మునుపే తీసుకుంటుంది. గర్భంలోని శిశువుకి ఆత్మీయ స్పర్శని చేతితో అందిస్తూ గర్భకుహరంలో చీకటిలో భయపడ వద్దని ధైర్యం చెబుతుంది. ఆమె మాటలు బిడ్డ విన్నా, వినకున్నా కబుర్లు చెప్పి అమ్మ మాటలు రుచి చూపుతుంది. అలాంటి కన్న ప్రేమని పెంచిన బిడ్డపై చూపగలిగే మహోన్నత తల్లి మనసుకే ఉంది.

తల్లి బిడ్డ బాగునే కోరుతుంది. ఆ బిడ్డకు ఏదేని సమస్య కష్టం ఉందని తెలిస్తే ఆమె తల్లడిల్లుతుంది. తను కష్టపడి తన బిడ్డకి మంచి చేయాలనే చూస్తుంది. ఇక్కడ ఆమె తల్లి పేగుని తెంచుకున్న పసిప్రాణం సొంత బంధం కాకపోవచ్చు. కానీ ఆమె కంటి వెలుగై వేలుపట్టి ఆమె బతుకులోనికి వచ్చిన బిడ్డ కావచ్చు. అయినా ఆమె ప్రేమలో మార్పుండదు. ఆ తల్లి ప్రేమని రుజువు చేస్తూ భర్తతో యాదమ్మ రాంపండుకి మాటలను రప్పించే చికిత్స గురించి సంభాషిస్తూ పలికిన మాటలే నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయి.

"*నా రాంపండుకి మాటలు రావడం కోసం తొమ్మిది వేల కిలోమీటర్లయినా నడుస్తాను*" అంటూ తన ఆత్మవిశ్వాసాన్నే కాక బిడ్డ కోసం, అమ్మా అనే పిలుపు కోసం తల్లి పడే తపనని చూపింది. ఒక అమ్మకి బిడ్డ బాగుండటమే బలం. అలాంటిది ఆ బిడ్డ కోసం అతడికి మాటలు వచ్చే చికిత్స కోసం ముక్కామల నుండి తణుకుకి ఉన్న తొమ్మిది కిలోమీటర్లు రాంపండుని చంకనెత్తుకొని నడుస్తానన్న యాదమ్మ గొప్పది. తల్లి కష్టాన్ని లెక్కచేయదు. బిడ్డ లోపాలను అధిగమించి బాగా చదువుకొని పెద్ద ఉద్యోగం చేసి పేదలకు ఉపయోగపడాలి అని అనుకుంటుంది. ఆమె వాక్కే బ్రహ్మ వాక్కై బిడ్డని అభివృద్ధి పథంవైపు నడుపుతుంది. తన బాగుకో, తనకి సంపాదించి పెట్టాలనో కాకుండా తన బిడ్డల వలన నలుగురికీ మంచి జరగాలని కోరుకోవడంలో తల్లి ఔన్నత్యం బయటపడుతుంది. సమాజానికి, ఆమె పెంపకానికి ఒక వెలుగునిచ్చే వారసుడిని ఆమె తయారు చేయడానికి శ్రమిస్తుంది. వానల్లో భర్త రిక్షాని తానే తోలి బిడ్డకి చికిత్సనే కాక తొలి పలుకులకు, తొలి విద్యకు ఆమె పడిన తాపత్రయం అపూర్వం. జన్మజన్మల రుణానుబంధాలే ఇంతలా పెనవేసుకోగలవు. అలా తాను పందిరై బిడ్డని ఎదగనిచ్చే తల్లి ఆ బిడ్డలంక తలెత్తే చూస్తుంది. ఆమె పెంపకం తలదించుకోని విధంగా

వృద్ధి చెందుతుంది. అమ్మ పూనే సంకల్పం బిడ్డకెప్పుడూ శ్రీరారక్షగా ఉంటుందని రచయిత అభివర్ణించడం గొప్పగా చెప్పుకోవచ్చు.

అమ్మ తానెంత కష్టడినా, కన్నీరు కార్చినా బిడ్డ కంట వెలుగుని, పెదాలపై చిరునవ్వుని చూసి తాను నవ్వుతుంది. కన్న బిడ్డ అయినా, పెంచిన బిడ్డ అయినా, ఏ మాత్రం తేడా లేకుండా చూసే మాతృమయిలున్నంతకాలం ఈ సృష్టికి ఎలాంటి ఢోకా ఉండదంటే అది అతిశయోక్తి కాదు. ఈ రోజుల్లో పిల్లల్ని కని వారిని గాలికి వదిలే వారున్నారు. ఏదో లోపంతో పుట్టాడని, కన్న నోర్లే కుంటోడు, గుడ్డోడు అంటూ మాటలనేవారూ ఉన్నారు. 'మూగాడు' అని రాంపండుని అనొద్దని భర్తకి, *"ఇంకా మాటలు రాలేదా?"* అనే జనులకు *"ఈ మధ్యన చాలామందికి ఆరేళ్లు వస్తే గాని మాటలు రావడం లేదట"* అని దబాయించే యాదమ్మ ప్రేమకి కొలమానం లేదు. లోపం ఉన్నా దాన్ని తొలగించి బిడ్డ బతుకుని చక్కదిద్దుకోవడం కోసం నిరంతరం శ్రమించే అమ్మల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. కంటికి రెప్పలా కాపాడుకునే వ్యక్తిత్వం ఉన్న తల్లుల చేతిలోని పెంపకాలు కూడా ఆ తీరుతోనే ఉండగలవు. ఈనాడు ఏ స్పీకింగ్ ఇనిస్టిట్యూట్, వాకింగ్ ఇనిస్టిట్యూట్ మానసిక చికిత్సాలయాల వంటి వాటి వద్ద బిడ్డలను తీసుకొని వచ్చి గంటలకొద్దీ పడిగాపులు కానే తల్లుల్ని చూస్తూనే ఉంటాం. ఆశ నిరాశల మధ్య ఊగిసలున్నా మనోధైర్యంతో బిడ్డ బాగునే పదేపదే కోరుకునే తల్లుల ఆకాంక్షలే ఆశీస్సులు. అంతేగాని చిరులోపానికే బిడ్డను విడిచిన రాంపండు కన్నవారి కఠినాలకు యాదమ్మ వ్యక్తిత్వం ఒక చెంపపెట్టు. ప్రేమతో దేన్నైనా అధిగమించేలా చేయగలం. ఆర్థికస్థితుల్ని, ఆరోగ్యాలను పట్టించుకోకుండా బిడ్డల కోసం తపించే తల్లి తానేమైనా లెక్కచేయదు. ఆమె అరచేతుల్లో పెరిగి అనాధాశ్రమాలలో తల్లులను చేర్చే కఠోర హృదయులు తల్లి విశిష్టతని అర్థం చేసుకోవాలి. తల్లి బిడ్డని భారం అనుకోనప్పుడు ఆ సంతానానికీ తల్లి ఒక భారం కాదు బాధ్యత. దీన్ని అర్థం చేసుకోవాలన్న ఉద్దేశ్యం కూడా తల్లి ఔన్నత్యాన్ని గుర్తింపచేస్తూ కథగా తీర్చారనిపించింది. ఇలా మచ్చలేని పున్నమి చందురుడు వంటి రాంపండుల వెనుక ఓ మహోన్నత స్త్రీ మూర్తి తప్పక ఉంటుంది. యాదమ్మ వంటి అమ్మలు గానీ అమ్మలుంటే ఈ నేలపై అనాధ అనే పదం వినిపించదు అనగలం.

## అమ్మతనం :

### కథ :

కామక్షమ్మ తన ఆడపడుచు కూతురు కిరణ్‌బాలని కొడుక్కిచ్చి పెళ్ళి చేస్తుంది. వారికి ఒక బాబు పుట్టగా బాలింతరాలైన కిరణ్‌బాలకు టైఫాయిడ్‌సోకి ఆ పసిబిడ్డకి తల్లిపాలనందివ్వ లేకపోతుంది. ఆ సమయంలో ఒక కురూపి అయిన ఓ స్త్రీ బిడ్డకి స్తన్యాన్నందివ్వటానికి వస్తుంది. ఒకప్పుడు తమ ఇంట పనిచేసిన రామయ్య దంపతుల కూతురైన అంజనమ్మ అని కామక్షమ్మకు తెలుస్తుంది. గతంలో కిరణ్‌బాల తల్లికి అమ్మతల్లి పోయగా అప్పుడు అంజనమ్మ చేత సేవలు చేయించి ప్రతిఫలంగా డబ్బుని ఆమె కన్నవారికి అందిస్తారు. తర్వాత ఆమెకూ అమ్మతల్లి సోకుతుంది. కామాక్షమ్మ కుటుంబం యాత్రలకు వెళ్ళి తిరిగి వచ్చేసరికి అంజనమ్మ కుటుంబం అక్కడి నుండి

వెళ్ళిపోతుంది. అప్పటి అందమైన అంజనమ్మ మసూచి వల్ల ఇలా కురూపిగా మారిపోయిందని కామాక్షమ్మ బాధపడుతుంది. దుష్టుడైన భర్త వల్ల పురిటి బిడ్డని కోల్పోయి తల్లిపాలను ఆసుపత్రిలో అవసరమైన బిడ్డలకు అందిస్తున్నానని అంజనమ్మ ఆమెకి చెప్తుంది. అప్పుడప్పుడూ బాబుని చూడటానికి వచ్చే ఆమెని కిరణ్ బాల అసహ్యంచుకుంటుంది. దీంతో కామాక్షమ్మ అంజనమ్మ అమ్మతనాన్ని గూర్చి కోడలికి చెప్తుంది. ఈ కథను భాస్కర బాల భారతి రాసారు. ఎన్.కె.బాబు సంపాదకత్వంలో వచ్చిన 'నాకు నచ్చిన నా కథ-1' అనే కథా సంకలనంలో ప్రచురితమైంది ఈ కథ.

విశ్లేషణ :

స్త్రీలో సహనం, అమ్మతనం అన్నవి ఎప్పుడూ ఆమెలో జీర్ణించుకుని గొప్పతనాన్ని ఆపాదింపజేస్తుంటాయి. అలాగే కష్టాలున్నా ప్రేమించే తత్త్వం ఆమెది. విధి ఎలాంటి జీవితాన్నిచ్చినా మనసుకి కురూపితనాన్ని ఆపాదించుకోని సౌందర్యం ఆమెకే సొంతమని ఈ కథ సోదాహరిస్తుంది. అదే విధంగా అమ్మ ప్రేమలోని రుచిని పంచగలిగే శక్తి ఉన్నందున మాతృస్థాన పూజార్హతని ప్రకృతి, సృష్టి ఆమెకు ఆపాదించాయి. ఆడ పిల్ల జననం సంపన్నుల ఇంటనైనా, లేని ఇంటనైనా సరే పరిస్థితుల్ని ఆకళింపు చేసుకుంటూ పెరిగే విధంగా ఆమెని ఆమె మలచుకోగలదు. పుట్టింట, మెట్టినింట ఎటువంటి జీవితం లభించినా శ్రమిస్తూ, పోరాడుతూ తన కుటుంబాన్ని నిలుపుకునేలా ప్రయత్నించడం ఆమె గొప్పతనం. అంతేకాకుండా ఆమె తన రక్తాన్ని పంచగా జన్మించి సొంత బిడ్డలకే కాక స్తన్యాన్ని పంచిన బిడ్డకూ అమ్మ ప్రేమ లోటుని రానివ్వదు. బిడ్డ తన బిడ్డ కాకున్నా తన వాత్సల్యాన్ని నేరుగానో, జ్ఞాపకాలుగానో కురిపించగలదు. అటువంటి అమ్మ లాలనలోని మధురాను భూతులనే తప్ప చేదుని తగలనివ్వని అమృతమయి స్త్రీ అని చాటిన కథగా నిలిచింది.

అమ్మతనానికి, అందానికి సంబంధం ఉండదు. అలాగే బిడ్డనికన్న ప్రతీ తల్లీ చనుబాలని ఆ పసిప్రాణానికి అందించలేకపోవచ్చు అన్నీ ఉన్న కిరణ్‌బాల తన బాబుకి అమ్మపాల రుచిని పంచలేకపోయింది. కానీ భయంకరాకారంతో ఉన్న అంజనమ్మ ఆ బాబుకి స్తన్యమిచ్చింది. ఆ బిడ్డని అప్పుడప్పుడూ వచ్చి చూసుకుంటూ తనకు బిడ్డల్లేరనే లోటుని ఆ తల్లి పూడ్చుకుంది. అటువంటి అమ్మ గొప్పతనాన్ని కామాక్షమ్మ కిరణ్‌బాలతో చెప్పిన మాటల్లో స్వార్థం లేని మాతృహృదయ స్వచ్ఛతని రచయిత్రి చూపించారు.

*"ఆమె కురూపి కావచ్చు. అంతకంటే ఆమె అమ్మతనం గొప్పది! కనిపడేశావు నీవు! చేరదీసి స్తన్యమిచ్చి పెంచింది నిస్వార్థంగా తాను!"* అమ్మతనం పాలవలె స్వచ్ఛమైంది. కురూపి కావచ్చు. వికలాంగురాలూ కావచ్చు కానీ ఆమె పంచే పాలు బిడ్డలకు జీవాన్నిచ్చే సుధలు. కన్నతల్లే కాకున్నా ఏ తల్లి పాలిచ్చినా బిడ్డ అందుకోగలదు. అలాగే బిడ్డ పరాయివాడైనా నా బిడ్డేనన్న మాతృ హృదయానందం పాలైపొంగి కడుపు నింపగలదు. అంజనమ్మకి అమ్మతల్లిపోసి వికారరూపంతో ఉండి ఉండొచ్చు. కానీ పై ఆకారాలకు అంటనిది తల్లి ప్రేమ బిడ్డకి పాలిస్తే అందం

తరిగిపోతుందని పుట్టీ పుట్టగానే కృత్రిమ పాలు పట్టే వారున్నారు. అలాంటి వారికి వెలకట్టలేని పాశపు విలువ తెలియదనే చెప్పాలి. అలాగే తనలో పొంగుతోన్న పాలసిరులను పంచే స్వార్ధమెరుగని అంజనమ్మ వంటి మాతృత్వం గొప్పదన్న భావననిక్కడ చూపించారు. అమ్మపాలు బిడ్డ హక్కు అని తెలుసుకోక పుట్టీపుట్టగానే ఆ హక్కుని దూరం చేసే వారికి అంజనమ్మ ఓ కనువిప్పు. కారణం ఏదైనా గానీ కిరణ్‌బాల బిడ్డకి తొలి పాలస్పర్శని అంజనమ్మ అందించింది. వందేళ్ళ ప్రాణానికి జీవం పోసే తల్లులుగా స్త్రీ జన్మ ధన్యం. తల్లిని నిర్లక్ష్యాలు చేసే బిడ్డలుంటారన్నది వాస్తవం. కానీ బిడ్డ కాని బిడ్డలకు కూడా ప్రేమని పంచే అమ్మకాని అమ్మ యశోద వంటి వారుంటారు. అంతటి ఔన్నత్యం స్త్రీ జాతికి సొంతమని గుర్తింపజేసి తల్లి హృదయాన్ని ముందుంచారు.

సాధారణంగా స్త్రీకి మాత్రమే దక్కే అపురూపవరం మాతృత్వం. స్త్రీకి స్వతహాగా కొన్ని గుణాలు జన్మతః అబ్బుతాయి. సేవ చేయడం, శ్రమించడం సహనంతో ఉండటం, భరించే శక్తితో ఉండటం వంటివన్నీ ఆమెకు ఉంటాయి. వీటన్నింటినీ కలిగినదే అంజనమ్మ పాత్ర. కిరణ్‌బాల తల్లికి చేసిన సేవ, తనకు ఆమె వల్ల కురూపితనం అమ్మతల్లిగా సోకినా నిందించక *"పోతపాలెందుకమ్మా నీ మనమనికి మీరు ఒప్పుకుంటే నా చనుబాలు ఇస్తా"* అంది. తన బతుకులోకి వచ్చిన కురూపి తనమైనా, దుర్మార్గపు భర్తనైనా భరించింది. ఆ ఓర్పు, భరించే శక్తి స్త్రీత్వానికే చెల్లుతుంది. అతివకు అమ్మ స్థానమిచ్చి తరాల వంశాలను నిలిపే సామర్థ్యాన్ని ప్రకృతి కల్పించింది అనవచ్చు. కష్టాలు, కన్నీళ్లని సహజంగా తీసుకుంటూ తన బతుకుతో ముడిపెట్టబడిన బంధాలతో కదిలేది అరుదైన అమ్మ మాత్రమే. ఆమె విశిష్టతని గుర్తించని సంతానాలున్న చోట ఆమె గొప్పతనాన్ని పరికింపజేయటం కథ యొక్క ఉద్దేశ్యంగా ఉంది. అమ్మతనం స్త్రీ ఔన్నత్యానికి నిదర్శనంగా ఉంది. కన్నప్రేమ, పెంచిన ప్రేమ, పాలందించిన ప్రేమల్లో లాలన ఏ రూపులో ఉన్నా మాతృమూర్తులైన స్త్రీలకే దక్కే విశిష్టతగా తెలుస్తోంది.

## ఆధార గ్రంథాలు


1. బాబు. ఎన్.కె. (2019). ***నాకు నచ్చిన నా కథ – 1.*** విజయవాడ: సాహితి ప్రచురణలు.
2. బాబు. ఎన్.కె. (2019). ***నాకు నచ్చిన నా కథ – 2.*** విజయనగరం: ఎన్.కె. పబ్లికేషన్స్.
3. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. (2016). ***కథాశిల్పం.*** విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. శ్రీరామమూర్తి, కోడూరి., సంజీవమ్మ, పి., వెంకట్రామయ్య, డి., నవీన్, అంపశయ్య. (2009). ***తెలుగు కథానిక – పరిశీలన (1925-1980).*** హైదరాబాద్: డా॥ మాడభూషి రంగాచార్య స్మారక సంస్థం.